హనుమకొండ : కేక్ కట్ చేస్తున్న న్యాయవాదులు

హనుమకొండ : మొక్క నాటుతున్న మర్రి యాదవరెడ్డి

నడికూడ : పిల్లలకు పండ్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి లింగంపల్లి కిషన్‌రావు


పరకాల : సివిల్ ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

వేలేరు : పంట పొలాల్లో కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు

హనుమకొండ చౌరస్తా : కేయూలో మొక్క నాటుతున్న బీఆర్ఎస్వీ నాయకులు

దామెర : కేసీఆర్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ శ్రేణులు

హనుమకొండ చౌరస్తా : వేడుకల్లో పాల్గొన్న నాయకులు

కమలాపూర్ : కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తెలంగాణ రాష్ట్ర సాధకుడు కేసీఆర్

- రాష్ట్రంతో ఆయనది పేగుబంధం
- పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్
- కేసీఆర్ పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి
- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి
- పదేళ్ల పాలన స్వర్ణయుగం
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి
- జిల్లాలో ఘనంగా చంద్రశేఖర్‌రావు జన్మదిన వేడుకలు

కాజీపేటలో జై కేసీఆర్, జై తెలంగాణ నినాదాలు చేస్తున్న దాస్యం వినయ్‌భాస్కర్, బీఆర్ఎస్ శ్రేణులు

నమస్తే నెట్‌వర్క్, ఫిబ్రవరి 17 : అలుపెరుగని పోరాటం చేసి తెలంగాణ స్వరాష్ట్రాన్ని సాధించిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలకు ఆయన హాజరయ్యారు. వడ్డేపల్లి ట్యాంక్ బండ్‌పై సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో కేసీఆర్ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఫాతిమా చౌరస్తాలోని మదర్ థెరిస్సా విగ్రహం వద్ద మొక్కలు నాటారు. ఫాతిమా నగర్‌లోని హౌజ్ ఆఫ్ జాయ్ ఆశ్రమంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి, మానసిక దివ్యాంగులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కాజీపేట చౌరస్తాలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణను పదేళ్లలో దేశంలోనే అగ్రభాగాన నిలిపిన పాలకుడని, అన్నార్థుల తెలంగాణను అన్నపూర్ణగా మార్చిన మహనీయుడన్నారు. తెలంగాణే ఆశ, ఆశయంగా జీవిస్తున్న తెలంగాణ తల్లి ముద్దుబిడ్డ కేసీఆర్ అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలు సుఖక్షంగా జీవించారన్నారు. కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, కార్పొరేటర్లు, బొంగు అశోక్‌యాదవ్, చెన్నం మధు, ఇమ్మడి రాజు, నాయకులు నార్లగిరి రమేశ్, సుంచు కృష్ణ, శిరుమల్ల దశరథం, గబ్బెట శ్రీనివాస్, తేలు సారంగపాణి, బస్వ యాదగిరి, అప్జల్, దువ్వ కనుకరాజు, జాగృతి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పబ్బోజు శ్రీకాంత్ చారి, మంజుల పాల్గొన్నారు. కేసీఆర్ పాలనలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. హనుమకొండలోని తన నివాసంలో మొక్క నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు కేసీఆర్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తూ ప్రజల పక్షాన నిలబడుతామన్నారు. అలాగే ఆత్మకూరులో కేక్ కట్ చేసి వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. మళ్లీ సీఎంగా కేసీఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని, కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయామని ప్రజలు తెలుసుకున్నారన్నారు. మండలాధ్యక్షుడు లేతాకుల సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శి బొల్లోజు కుమారస్వామి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాంతాల కేశవరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రేవూరి సుధాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు పాపని రవీందర్ పాల్గొన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలన స్వర్ణయుగమని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. శాయంపేట బస్టాండ్ కూడలిలో 25 కిలోల భారీ కేకు కట్ చేశారు. గోవిందాపూర్ గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు దాసి శ్రావణ్ కుమార్ వ్యవసాయ క్షేత్రంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్యాయానికి గురవుతున్న తెలంగాణను కాపాడి ప్రజలను అక్కున చేర్చుకున్నారన్నారు. నిత్యం కరువుతో అల్లాడుతున్న రాష్ట్రాన్ని అన్నపూర్ణగా మార్చిన ఘనత ఆయనదేనని అన్నారు. రాష్ట్రంలో సాగుతున్న దుర్మార్గమైన పాలనపై కేసీఆర్ నేతృత్వంలో పోరాటం చేస్తామన్నారు. మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, మండలాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, గ్రామ అధ్యక్షుడు రాజే రాజేందర్ పాల్గొన్నారు. హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలోని కార్యాలయంలో కార్యకర్తలతో కలిసి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి వృక్షార్చనలో భాగంగా మొక్కలు నాటారు. తెలంగాణ ఉన్నన్ని రోజులు కేసీఆర్ ఆనవాళ్లు ఉంటాయన్నారు. రాజకీయాలు ఎలా ఉన్నా కేసీఆర్ ఉద్యమ చరిత్ర, తెగింపు, తెలంగాణ సాధించడానికి చేసిన త్యాగం, ప్రజలపై ఆయనకు ఉన్న అకింతభావం, ప్రేమ ఎవరూ కాదనలేరన్నారు. రాజకీయాల్లో రాణించాలనుకునే యువత కేసీఆర్ జీవితాన్ని, రాజకీయ ప్రయాణాన్ని అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జరిగిన సంబురాలకు పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజనీకాంత్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్ హాజరయ్యారు. భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూరులో జడ్పీ మాజీ చైర్మన్ మారపల్లి సుధీర్ కుమార్ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. తన పాలనలో ప్రజా సంక్షేమం కోసం కేసీఆర్ ఎనలేని కృషి చేశారని ప్రశంసించారు. అలాగే జిల్లా వ్యాప్తంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. బీఆర్ఎస్ కార్యకర్తలు కేకులు కట్ చేసి సంబురాలు నిర్వహించారు. పలు చోట్ల వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, మండల, గ్రామ అధ్యక్షులు పాల్గొన్నారు.

ధర్మసాగర్ : కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

భీమదేవరపల్లి : ముల్కనూరులో కేక్ కట్ చేస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ సుధీర్‌కుమార్

ఎల్కతుర్తి : మొక్కలు నాటుతున్న బీఆర్ఎస్ నాయకులు


ఐనవోలు : తెలంగాణ తల్లి సెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

హనుమకొండ : కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పార్టీ శ్రేణులు

హసన్‌పర్తి : జయగిరిలో సంబురాల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

వేలేరు : కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I THOUTAM BHAGYALAKSHMI (Old Name) H.No. 2-10-206, Kummariwada, Near Pingili College, Waddepally, Hanumakonda Dist. T.G., have changed my name from THOUTAM BHAGYALAKSHMI to THOUTAM BHAGYA LAXMI (New Name) W/o THOUTAM RAMBABU.
NTW-6555

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

గ్రీవెన్స్ దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ ప్రావీణ్య
- బాధితుల నుంచి వినతుల స్వీకరణ

హనుమకొండ, ఫిబ్రవరి 17 : గ్రీవెన్స్‌లో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తం 70 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో తహసీల్దార్ కార్యాలయాలకు సంబంధించి 19, జీడబ్ల్యూఎంసీవి 8, ఎంపీడీవో ఆఫీసులు 8, హనుమకొండ ఆర్డీవో ఆఫీసు 7, కలెక్టరేట్‌లోని వివిధ సెక్షన్లకు సంబంధించి 5, పరకాల ఆర్డీవో 4, డీపీవో 3, జిల్లా సంక్షేమాధికారి 3, డీఆర్‌డీవో 2, ఇరిగేషన్ 2, ఎంజీఎం దవాఖాన 2, మిగిలినవి ఇతర శాఖలకు చెందినవి ఉన్నాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్వో వైవీ గణేశ్, బీసీ వెల్ఫేర్ అధికారి రాంరెడ్డి, డీఆర్డీవో మేన శ్రీను, జడ్పీ సీఈవో విద్యాలత పాల్గొన్నారు.

మహా శివరాత్రికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి..

మహాశివరాత్రి ఉత్సవాలకు దేవాలయాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఈ నెల 26న జరుగనున్న మహా శివరాత్రి ఉత్సవాలపై సమావేశం నిర్వహించారు. హనుమకొండలోని వెయ్యిస్తంభాల దేవాలయం, మడికొండ మెట్టు రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలన్నారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా చూడాలని, మహిళా భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున మహిళా పోలీస్ సిబ్బంది ఎక్కువగా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. అనంతరం మహా శివరాత్రి ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఆర్డీవో రాథోడ్ రమేశ్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సునీత, ఏసీపీ దేవేందర్‌రెడ్డి, వెయ్యిస్తంభాల గుడి ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్ర శర్మ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పనులు త్వరగా పూర్తి చేయాలి..

అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, టాయిలెట్స్, తదితర అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఐసీడీఎస్ అధికారులు, సూపర్‌వైజర్లు, పంచాయతీరాజ్ అధికారులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. పనులు పూర్తయిన వెంటనే బిల్లులు సమర్పించి వాటికి పేమెంట్ జరిగేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా సంక్షేమ అధికారి జయంతి, పంచాయతీరాజ్ ఈఈ శంకరయ్య పాల్గొన్నారు.

సమస్యను కలెక్టర్‌కు వివరిస్తున్న బాధితులు

జీవనోపాధికి లోన్ మంజూరు చేయాలి..

- బానోత్ రవికుమార్, దివ్యాంగుడు

హనుమకొండ కుమార్‌పల్లికి చెందిన దివ్యాంగుడిని. నేను పదో తరగతి వరకు చదువుకున్న. కిరాణా దుకాణం పెట్టుకొనేందుకు లోన్ కోసం దరఖాస్తు చేసుకొని చాలా రోజులు అవుతున్నది. ఇంత వరకు ఎలాంటి సమాచారం లేదు. రుణం మంజూరు చేయించి ఆదుకోవాలి.

మూడు రోజులు విద్యుత్ సరఫరా నిలిపివేత

దామెర/హనుమకొండ, ఫిబ్రవరి 17 : మండలంలోని ఓగులాపురం 220కేవీ విద్యుత్ టవర్ల నిర్మాణం, కొత్త లైన్ల పనుల దృష్ట్యా 11కేవీ ఫీడర్ పరిధిలో ఈ నెల 18, 19, 20వ తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ గుర్రం రమేశ్ సోమవారం తెలిపారు. ఓగులాపురం, దమ్మన్నపేట, తక్కళ్లపహాడ్ గ్రామాలకు చెందిన గృహ, వ్యవసాయ, వాణిజ్య వినియోగదారులు సహకరించాలని కోరారు. అలాగే హనుమకొండ టౌన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలోఅంతరాయం ఉంటుందని ఆపరేషన్స్ డీఈ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బాలసముద్రం సబ్ స్టేషన్ పరిధిలోని పద్మాక్షి కాలనీ, రాజ్‌పుత్‌వాడ ఏరియాల్లో ఉదయం 9 నుంచి 11గంటల వరకు, న్యూశాయంపేట సబ్ స్టేషన్ పరిధిలోని కోర్టు వెనుక సైడ్, అదాలత్ జంక్షన్ ఏరియాల్లో ఉదయం 8 నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న చైల్డ్ వెల్ఫేర్ కమిటీ

మడికొండ, ఫిబ్రవరి 17 : గ్రేటర్ 63వ డివిజన్ ఉనికిచర్ల గ్రామంలో ఓ బాల్య వివాహాన్ని ధర్మసాగర్ మండల చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అడ్డుకుంది. ఉనికిచర్లకు చెందిన పదో తరగతి చుదువున్న విద్యార్థినిని అదే మండలం వంగాలపల్లి గ్రామానికి చెందిన అబ్బాయితో బాల్య వివాహం చేస్తున్నారని సమాచారం అందుకున్న సీడబ్ల్యూసీ వివాహాన్ని అడ్డుకుని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

ఎస్సై కుటుంబానికి ఆర్థికసాయం

పున్నేల్‌లో ఎస్సై తల్లిదండ్రులకు చెక్కు అందజేస్తున్న 2012 బ్యాచ్‌మేట్స్

ఐనవోలు, ఫిబ్రవరి 17 : ఎస్సై కుటుంబానికి తోటి బ్యాచ్‌మేట్స్ ఆర్థికసాయం అందజేశారు. మండలంలోని పున్నేల్ గ్రామానికి చెందిన ఎస్సై జిల్లా అంబేద్కర్ 2016లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా 2012 ఎస్సై బ్యాచ్‌మేట్స్ సొసైటీ ఆధ్వర్యంలో మృతుడు ఎస్సై అంబేద్కర్ తల్లిదండ్రులకు రూ.4లక్షల చెక్కును సోమవారం అందజేశారు. కార్యక్రమంలో సీఐ ఐటీ కోర్ శ్రీనివాస్, ఎస్బీ సీఐ సురేశ్, సీఐ టీఎస్ నాబ్ బీ రవీందర్, ఎస్సైలు పస్తం శ్రీనివాస్, రాజు, రవికుమార్, వెంకన్న, శ్రీకాంత్, ప్రభాకర్ పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులకు మహిళ అప్పగింత

హనుమకొండ, ఫిబ్రవరి 17 : తప్పిపోయి నగరంలో తిరుగుతున్న మహిళను కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు హనుమకొండ సఖి వన్‌స్టాప్ అడ్మిన్ హైమావతి తెలిపారు. ఈ నెల 15వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో లష్కర్ బజార్ ప్రాంతంలో మతిస్థిమితం లేని 50 సంవత్సరాల మహిళ రోడ్డుపై తిరుగుతుందని సఖి సెంటర్ 181కు కాల్ వచ్చిందని, వెంటనే సిబ్బంది పోలీసుల సహాయంతో ఆ మహిళను సెంటర్‌కు తీసుకొచ్చి వసతి కల్పించి మరుసటి రోజు కౌన్సెలింగ్ చేశామన్నారు. మహిళ తెలిపిన కొన్ని చిరునామాల ఆధారంగా వివరాలు ఫోన్ ద్వారా కనుక్కోగా, ఆ మహిళ నందిగామకు చెందిన సమ్మక్కగా గుర్తించి ఆమె బంధువులు, కుమారుడికి ఫోన్లో సమాచారం ఇచ్చామని తెలిపారు. కుమారుడు రాజుకు సఖి సెంటర్‌కు రాగా, మట్టెవాడ పోలీసుల సమక్షంలో సమ్మక్కను అప్పగించినట్లు చెప్పారు.

ఘనంగా ఆకాశవాణి 35వ వార్షికోత్సవం

హనుమకొండ, ఫిబ్రవరి 17 : హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో ఆకాశవాణి వరంగల్ కేంద్రం ఏర్పాటు చేసి 35 సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా క్యాజువల్ అనౌన్సర్స్, క్యాజువల్ కాంపెరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వార్షికోత్సవం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మోటె చిరంజీవి, ప్రధాన కార్యదర్శి అర్షం సదానందం, గౌరవ సలహాదారు పసుల ఎల్లయ్య, కోశాధికారి పరంకుశం శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు భాగ్య, పింగిలి కుమార్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఓపెన్ టు ఆల్ చెస్ విజేత శ్రీవాత్సన్

గెలుపొందిన క్రీడాకారులతో నిర్వాహకుడు కన్నా

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 17 : వరంగల్ చదరంగం సమాఖ్య ఆధ్వర్యంలో హనుమకొండలోని తిరుమల తిరుపతి దేవస్థానంలో నిర్వహించిన ఓపెన్ టు ఆల్ చదరంగం పోటీల్లో విజేతలకు నిర్వాహకులు బహుమతులను ప్రదానం చేశారు. ఓపెన్ టు ఆల్ విభాగంలో అల్లాడి శ్రీవాత్సన్, మ్యాకల శ్రీకాంత్, తుర్క రాజు, రవీంద్రనాథ్, తిరుపతచారి మొదటి ఐదు స్థానాలు గెల్చుకున్నట్లు నిర్వాహకుడు కన్నా తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ ఆర్బిటర్స్ శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్, రజినీకాంత్, శ్రీకాంత్, రవీందర్ పాల్గొన్నారు.

నీటి చౌర్యాన్ని అడ్డుకోవాలి

లక్ష్మీపురం మంతూర్తివారి కుంటలో అక్రమంగా ఏర్పాటు చేసిన మోటర్

ఐనవోలు, ఫిబ్రవరి 17 : నీటి చౌర్యాన్ని అడ్డుకోవాలని రైతులు కోరుతున్నారు. ఐనవోలు శివారు లక్ష్మీపురం మంతూర్తివారి కుంటలో ఒంటిమామిడిపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు అక్రమంగా మోటర్ ఏర్పాటు చేసి నీటి చౌర్యానికి పాల్పడుతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వారు ఆరోపించారు. కుంటలో నీళ్లు ఉంటే ఎండకాలం పశువులకు దాహార్తి తీరుతుందని, బావులు, బోర్లలో నీటి సమస్య రాదని, నీటి చౌర్యానికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

జీపీలకు నిధులు విడుదల చేయాలి

దామెర, ఫిబ్రవరి 17 : మండలంలోని పంచాయతీ కార్యదర్శులు సోమవారం గ్రామ పంచాయతీల నిర్వహణకు గత ఆగస్టు నెల నుంచి పెండింగ్‌లో ఉన్న చెక్కుల చెల్లింపునకు ప్రభుత్వం వెంటనే నిధులను విడుదల చేయాలని కోరుతూ ఎంపీడీవో విమల, ఎంపీవో రంగాచారికి వినతిపత్రం అందజేశారు. గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం, ట్రాక్టర్ డీజిల్, మరమ్మతులు, బ్లీచింగ్ పౌడర్, దోమల నివారణ కోసం షాపుల నుంచి ఉద్దెరపై సామగ్రి, వస్తువులను తీసుకొస్తున్నామని, ఇప్పటివరకు ఖర్చు చేసిన డబ్బులను ప్రభుత్వం విడుదల చేయలేదన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇంజపెల్లి నరేశ్, రాష్ట్ర ఈసీ సభ్యులు అర్షం శ్రీనివాస్, శివశంకర్, వేణుమాధవ్, మణిదీప్, కవిత, సిరివెన్నెల, సుకన్య పాల్గొన్నారు.

'సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి'

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 17 : సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని కేయూ పాలక మండలి సభ్యురాలు అనితారెడ్డి అన్నారు. సోమవారం ఆర్ట్స్ కాలేజీలో ఉమెన్ గ్రీవెన్స్ సెల్ ఆధ్వర్యంలో 'సైబర్ నేరం(క్రైమ్) హ్యూమన్ ట్రాకింగ్' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ జ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ.. సాంకేతికతో కొంతమంది నేరాలకు పాల్పడుతున్నారన్నారు. సైబర్ క్రైం ఏసీపీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. మానవ అభివృద్ధికి సాంకేతిక వ్యవస్థ ఎంతగానో తోడ్పడుతున్నప్పటికీ రోజురోజుకూ మోసాలు పెరిగిపోతున్నాయన్నారు.

ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలి

మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి

శాయంపేట, ఫిబ్రవరి 17 : ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. కొప్పులలో బొడ్రాయి దేవతను దర్శించుకున్నారు. అభివృద్ధి విషయంలో తన వంతు సహకారం అందిస్తానన్నారు. వంగాల నారాయణరెడ్డి, బగ్గి రమేశ్, తోకల సమ్మిరెడ్డి, గుర్రం రవీందర్, నిమ్మల మహేందర్, బెరుగు రాకేశ్, గౌస్ పాల్గొన్నారు.

కేయూ ప్రాంగణ నియామకాల్లో 105 మంది ఎంపిక

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 17 : కాకతీయ యూనివర్సిటీ మహిళా ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన బీటెక్ చివరి సంవత్సరం విద్యార్థినులు 105 మంది ప్రాంగణ నియామకాల్లో వివిధ సాఫ్ట్‌వేర్ కంపెనీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ భిక్షాలు తెలిపారు. ఎంపికైన వారిని వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం అభినందించారు. ఇన్ఫోసిస్‌లో ఇద్దరు, డిజీ గీక్స్‌లో ముగ్గురు, జెన్‌ప్యాక్ట్‌లో 35మంది, డెల్ఫీ టీవీఎస్‌లో 18మంది, క్యూ స్పైడర్‌లో 33మంది, పెంటగాన్ స్పేస్‌లో 10మంది, ఎకో బ్రైన్స్‌కు నలుగురు ఎంపికయ్యారని, వీరికి వార్షిక వేతనం రూ.3.2 లక్షల నుంచి 4.5 లక్షలుగా ఉన్నదని, జూన్‌లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుందన్నారు. వీరు హైదరాబాద్, చెన్నై, బెంగళూరులో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బొల్లం కిరణ్‌ను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల సహాయ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు, పర్యవేక్షకుడు బానోత్ వీరయ్య ఉన్నారు.

ఎంపికైన విద్యార్థులతో వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రాంచంద్రం